www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 డిసెంబర్ 2023
5
అన్నమయ్య

జెసిని కలిసిన ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త బోదేషా

ప్రజాశక్తి-పీలేరు

ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త బోధేశావలి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహమద్‌ఖాన్‌తో ఆదివారం పీలేరులో కలిశారు. ఈ సందర్భంగా జెసి ప్రకృతి వ్యవసాయ సాగుపై అతనితో చర్చించారు. మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను సందర్శించాలని బోదేషా జెసిని కోరారు. అందుకు ఆయన స్పందిస్తూ త్వరలో వస్తానని చెప్పారు. బోదేషా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులుగా కూడా పనిచేశారు.

జెసితో మాట్లాడుతున్న శాస్త్రవేత్త బోదేషా

కొవ్వొత్తుల నిరసన

- జగన్ మావయ్యా అంగన్వాడీల వైపు చూడాలంటూ పలకలతో చిన్నారుల నిరసన
- రాయచోటిలో జిఒ ప్రతులు దహనం
- సమ్మెకు విద్యార్థుల తల్లిదండ్రుల మద్దతు
- 13వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కొన్ని చోట్ల చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. జగన్ మావయ్యా మా టీచర్ మాకు కావాలి, మా టీచర్, ఆయాకు జీతాలు పెంచండి అంటూ పలకలపై రాసి ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

రాజంపేట : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, చిన్నారులు, వారి తల్లులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వం అంగన్వాడీలకు ఇస్తున్న రూ.11,500 వేతన జిఒలను రాయచోటి తహశీల్దార్ కార్యాలయం ఎదుట దహనం చేస్తూ కనీస వేతనం రూ.26 వేలివ్వాలంటూ నిరసన తెలిపారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. రాత్రి స్థానిక జూనియర్ కళాశాల ఆవరణం నుండి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసెడెంట్ డి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మొదలైన కొవ్వొత్తుల ర్యాలీలో అంగన్వాడీలు బంగ్లా మీదుగా ప్రారంభమై వైయస్సార్ సర్కిల్‌లో మానవహారం నిర్మించి ధరలకు తగ్గ జీతం పెంచాలంటూ గట్టిగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం చేరుకుని సమ్మె గురించి మాట్లాడుతూ వేతనాలు పెంచేదాకా, క్రిస్మస్ తర్వాత మరింత ఉధృతమైన పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమం సిద్దమ్మ, విజయ, సుమలత, అరుణ, శోభ, నాగమణి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్** : అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయా కేంద్రాలలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులు, వారి తల్లులు తమ సంఘీభావం తెలిపి కేంద్రాల వద్ద చిన్నారులతో కలిసి నిరసన తెలియజేశారు. **పుల్లంపేట** : అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల తల్లులు సంఘీభావం తెలిపారు. పిల్లల తల్లులు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలపై, వారు చేస్తున్న పోరాటంపై ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. అంగన్వాడీల సమ్మెకు ప్రజల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన అంగన్వాడీలకు న్యాయం చేయకపోతే మహిళల ఉసురు తగులుతుందని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం గంగలో కొట్టుకుపోతుందని తెలియజేశారు. 13 రోజుల నుంచి కుటుంబాలను భర్త, పిల్లలను సైతం వదిలి రోడ్లెక్కిన అంగన్వాడీలకు తక్షణమే తగిన న్యాయం చేయాలని పిల్లల తల్లులు డిమాండ్ చేశారు. అనంతరం లబ్ధిదారులతో కలసి సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి, మండల అధ్యక్షులు డి.వనజా కుమారి, కె.చెంచులక్ష్మి, ఎస్.నాగ లత, పి.రోజా, ఎ.రెడ్డమ్మ, రాధా, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు. **మదనపల్లి** :అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం స్పందించి వారికి న్యాయం చేయాలని పట్టణంలోని విజయనగర్ కాలనీలో అంగన్వాడీ సెంటర్లో ఉన్న విద్యార్థుల తల్లులు విద్యార్థులు పాల్గొని అంగన్వాడీల సమస్యలు తీర్చాలని అందుకు ముఖ్యమంత్రి దయ చూపాలని కోరారు. విద్యార్థులకు సరైన విద్య, సౌకర్యాలు అందుతాయని అదేవిధంగా గర్భిణులకు బాలింతలకు సరైన పౌష్టికాహారాలు కూడా అందుతాయని అందువల్ల వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి అంగన్వాడి సెంటర్ తెరవాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ కార్యకర్త భాగ్యమ్మ, సిఐటియు నాయకులు హరింద్రనాథ్ శర్మ, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చెవిలో పువ్వులు పెట్టుకొని అంగన్వాడీలు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వ చర్యలకు నిరసనగా చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** లక్కిరెడ్డిపల్లి మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యా లయం అంగన్వాడీలు రిలే నిరాహార దీక్షలో భాగంగా పొర్లుదండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి, కార్యదర్శి ఓబులమ్మ, సెక్టార్ లీడర్లు రుక్మిణి ప్రభావతి లక్ష్మీదేవి సునీత తదితరులు పాల్గొన్నారు **బి.కొత్తకోట** : తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, తల్లిదండ్రులు కొవ్వొ త్తుల ప్రదర్శనతో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

మదనపల్లె : చెవిలో పువ్వులతో అంగన్వాడీల నిరసన

లక్కిరెడ్డిపల్లె : పొర్లుదండాలు పెడుతూ అంగన్వాడీల నిరసన

బి.కొత్తకోట : నిరసనలో పిల్లలు, తల్లిదండ్రులు



సింహాద్రిపురం : తహశీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో సిఎం జగన్

వేంపల్లె : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి

అభివృద్ధిలో పులివెందుల ఆదర్శం

- ఇడుపులపాయలో క్రిస్మస్ ప్రార్థనలు
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-వేంపల్లె/సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గం అభివద్ధికి నిదర్శనమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఇడుపులపాయలో ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్ఆర్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. సింహాద్రిపురంలో రూ36.03 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో పులివెందుల రూరల్ మండల, సింహాద్రిపురంలో వేర్వేరుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి పాడా అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఆయా చోట్ల సిఎం జగన్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు, ప్రభుత్వ ఆశయాల ఆచరణకు సంపూర్ణ సహకారం, మద్దతునిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రిజర్వాయర్ల పరిసర ప్రాంత గ్రామాల్లోని గ్రామస్థులకు, రైతులకు ఏవైనా సమస్యలను పూర్తి వివరాలతో అందజేస్తే సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయ రెడ్డి, ఓఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సలహా కమిటీ మెంబర్ బలరామిరెడ్డి, మండలధ్యక్షులు, ఎంపిటిసిలు ఖాదరబాధర వరలక్ష్మి, కొమ్మా వరలక్ష్మి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తం రెడ్డి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేస్తున్న వై.ఎస్. జగన్

వేంపల్లె : ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సిఎం

జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ప్రాల్గొన్నారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని నెమళ్ల పార్కు సమీపంలో ఉన్న ప్రార్థన మందిరంలో తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిలతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ క్రిస్మస్ వేడుకలకు చెందిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాదాపు రెండు గంటల వరకు కొనసాగిన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో సిఎం పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులతో సంతోషంగా సిఎం గడిపారు. బంధువులైన ప్రతి ఒక్కరికి పేరుతో సిఎం పలకరించి ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సిఎం తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ సుధీకర్ రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జున రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప మేయర్ సురేష్ బాబుతో పాటు సిఎం బంధువులు, ఎమ్మెల్యేలు నాయకులు, పాల్గొన్నారు.

రూ.36.02 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

సింహాద్రిపురంలో రూ.36..02 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సిఎం జగన్ ప్రారంభోత్సవాలు చేశారు. నూతనంగా నిర్మించిన రోడ్డు వెడల్పు సుందరీకరణ పనులు, వైఎస్సార్ పార్కు, తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయాలను ప్రారంభించారు. పాడా నిధులతో మండల కేంద్రంలో రూ.11.6 కోట్లతో నూతనంగా సుందరీకరరించిన రోడ్లు, జంక్షన్‌లను మొదట ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఫోర్ లైన్ సిసి రోడ్, బి.టి రోడ్ జంక్షన్‌లు ఉన్నాయి. అనం తరం రూ 5.5 కోట్ల నిధులతో 1.5 ఎకరాల్లో సుందరంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ పార్కును ఆయన ప్రారంభించారు. ఎంట్రీలో ప్లాజా వాటర్ ఫౌం డేషన్, చిన్నపిల్లల ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, వైఎస్ఆర్ విగ్ర హాలను అందంగా ఏర్పాటు చేశారు. అనంతరం రూ.3.19 కోట్ల పాడానిధులతో నిర్మించిన న్యూ తహశీల్దార్ ఆఫీస్ బిల్డింగ్‌ను, రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన న్యూ పోలీస్ స్టేషన్‌ను, రూ 3.16 నిధులతో నిర్మించిన ఎంపిడిఒ ఆఫీసును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.మహబూబ్బాషా, ఎంపిడిఒ జి.కృష్ణమూర్తి, ఎస్ఐ రోషన్, పోలీస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఇడుపులపాయలో సిఎం బస

సింహాద్రిపురం మండల కేంద్రంలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలను ముగించుకుని సాయంత్రం 4.50 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేరుకున్నారు. నాయకులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ఉన్న వైసిపి నేతలను సిఎం పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

చేనేతల ఆర్థిక అభివృద్ధికి కృషి

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో చేనేత కార్మికులకు, వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ వారికి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో చేనేత కార్మికులకు, వారి కుటుంబాలకు ఆర్థిక అబివృద్ధి ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

జిల్లా చేనేత అధికారుల కార్యాలయాల, పనివివరాలు తెలపండి?

జిల్లా చేనేత కార్యాలయం రాయచోటి జిల్లా కేంద్రంలో ఉంది. ఇందులో ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా చేనేత, అబివృద్ధి, సహాయ అభివృద్ధి అధికారులు మొత్తం నలుగురు ఉన్నారు. జిల్లాలో సొసైటీలో ఉన్న చేనేత కార్మికులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి అర్హతను బట్టి వారికి అందజేస్తున్నాం.

జిల్లాలో మగ్గాలు, చేనేత కుటుంబాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో సొసైటీ సభ్యులు 2122 మంది, వ్యక్తిగత సభ్యులు 5800 మంది, మొత్తం 7922 మంది చేనేత మగ్గాలకు చెందిన కుటుంబాలున్నాయి. 6500 చేనేత కుటుంబాలు ఉన్నాయి. 2100 విద్యుత్ మగ్గాలు ఉన్నాయి. 31 మంది సభ్యులు ఉన్నారు. 85 చేనేత మగ్గాలు, 32 విద్యుత్ మగ్గాలు ఉన్నాయి. వీరబల్లె, పుల్లంపేట, రాజంపేట, చిన్నమండెం, మదనపల్లె టౌన్, రూరల్, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, ములకలచెరువు, నిమ్మనపల్లె, కలకడ, పీలేరు ప్రాంతాలలో చేనేత పరిశ్రమలు ఉన్నాయి. ప్యూర్ సిల్క్, జారీ, ధర్మవరం శారీస్, వెంకటగిరి టైప్,కౌంట్, కాటన్ శారీస్ తయారు చేస్తారు. మదనపల్లె టౌన్, రూరల్, కురబలకోట ములకలచెరువు ప్రాంతాలలో విద్యుత్ మగ్గాలు ఉన్నాయి.

వైఎస్ఆర్ నేతన్న నేస్తం వివరాలు తెలపండి?

2019 సంవత్సరం నుంచి ఏడాదికి ప్రతి కుటుంబానికి రూ. 24 వేలు నేతన్న నేస్తం అందజేస్తున్నాం. 2021 సంవత్సరంలో 5837 లబ్ధిదారుల గాను రూ.14.88 కోట్లు, 2022 సంవత్సరంలో 6118 లబ్ధిదారులకు గాను రూ.14.68 కోట్లు, 2023 సంవత్సరంలో 6937 లబ్ధిదారుల గాను రూ.16.64 కోట్లు అందజేశారు.

పిఎం చేనేత ముద్ర యోజన పథకం వివరాలు తెలపండి?

ప్రధానమంత్రి చేనేత ముద్ర యోజన ద్వారా లక్ష నుండి రెండు లక్షల వరకు రుణాలను 15 శాతం సబ్సిడీతో ఇస్తున్నాం. 2021-22 సంవత్సరంలో ఫిజికల్ టార్గెట్ 2500, ఫైనాన్షియల్ టార్గెట్ 1250, 2700 దరఖాస్తులు బ్యాంకులో ఇచ్చాం. రూ.687.25 లక్షలు రుణం మంజూరైంది. 2022 - 23 సంవత్సరంలో రూ.368.50 లక్షలు మంజూరయ్యాయి. 2023- 24 సంవత్సరంలో ఫిజికల్ టార్గెట్ 910, ఫైనాన్షియల్ టార్గెట్ 455,656 దరఖాస్తులు బ్యాంకులో అందజేశాం.112 మంది లబ్ధిదారులకు రూ.128.70 లక్షలు రుణం మంజూరు అయినాయి. రాష్ట్రంలో జిల్లాలో ఎక్కువగా మంజూరయ్యాయి.

చేనేత క్లస్టర్ పథకాలు వివరాలు తెలపండి?

జిల్లాలో ఐదు చేనేత క్లస్టర్లు మంజూరయ్యాయి. శ్రీ వివేకానంద హ్యాండ్‌లో క్లస్టర్, మదనపల్లి టౌన్‌లో 2016- 17 సంవత్సరానికి అంగళ్లు క్లస్టర్ ప్రోగ్రాం, కురబలకోట మండలం 2021- 22 సంవత్సరం, రాజానగర్, మదనపల్లెటౌన్, నీరు గుట్టువారి పల్లె, మదనపల్లె, మదనపల్లి రూరల్ ప్రాంతాలలో చేనేత క్లస్టర్లు మంజూరైనాయి.

కార్మికులకు పెన్షన్ ఇస్తున్నారా?

జిల్లాలో 50 సంవత్సరాలు దాటిన వారు 3617 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరికి జనవరి 1 నుంచి రూ. 3 వేల పెన్షన్ అందజేస్తున్నాం. ఇతర పెన్షన్ తీసుకోవాలంటే 60 సంవత్సరాలు పైబడి ఉండాలి. చేనేత కార్మికులకు 50 సంవత్సరాలు పైబడితే వారు చేనేత పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చును. జిల్లాలో ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చును.

చేనేత కార్మికులకు సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటున్నారా?

జిల్లాలోని చేనేత కార్మికులు, కుటుంబాలు ఎవరు కూడా మధ్యవర్తులను సంప్రదించరాదు. ముద్రా రుణాలు, చేనేత పెన్షన్, ధ్రువీకరణ పత్రాలు మొదలగు అవసరాలకు కోసం జిల్లా కేంద్రంలో నేరుగా కార్యాలయంలో వచ్చి సంప్రదించాలి. మదనపల్లి ఆర్‌డిఒ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు అధికారి అందుబాటులో ఉంటారు. వారి సాయం పొందవచ్చు. ఏమైనా సమస్యలుంటే ఃసంప్రదించవచ్చును

సహకార సంఘాన్ని బలోపేతం చేయాలి

- సింగల్ విండో అధ్యక్షుని ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు సహకార సంఘాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కొత్త అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన నారే వెంకటరమణారెడ్డి బాధ్యతని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఆదివారం పీలేరు సింగిల్ విండో అధ్యక్షుడిగా నారే వెంకటరమణారెడ్డి చేత ఎంపిడిఒ మురళీమోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ సహకార సంఘాల పని విధానంలో మార్పు తీసుకొచ్చి వాటిని జాతీయ బ్యాంకులతో సమానంగా అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అందుకు ఎంపీ మిథున్‌రెడ్డి చొరవ చూపి నాబార్డుతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సహకార సంఘాల అభివృద్ధికి ఆయన సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు స్టాపుల మస్తాన్ సాహెబ్, తిమ్మయ్య, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు : ఎంపీ

ప్రజాశక్తి-పీలేరు

పేదలందరికీ ఇళ్ల పట్టాలిచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం పీలేరు మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 3300 ఇళ్ల పట్టాలను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన తర్వాత ఏ ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టలేదని తెలిపారు. జగన్ వచ్చిన తర్వాతనే పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో అన్ని మౌలిక సదుపాయాలతో పాటు విద్య, వైద్య సేవలు అందింస్తామని తెలిపారు. ఇళ్ల పట్టాలు అందిన వారు తమ ఆస్తిని అమ్ముకోకుండా తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చామని, పేదలందరూ ఇల్లు కట్టుకొని సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పీలేరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, దీనంతటికీ కారణం గౌరవ ముఖ్యమంత్రి తీసుకున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలేనని తెలిపారు. కార్యక్రమంలో పీలేరు తహశీల్దార్ ధనుంజయ్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

యువగళం వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువవగలం పాదయాత్రలో పాల్గొని చివరిదాకా నడిచి పాదయాత్ర విజయవంతం కావడంలో తమ వంతు పాత్రను పోషించిన రాయచోటికి చెందిన వాలంటీర్లు మురళి నాయుడు, సిద్దార్థరెడ్డి కుమార్ నాయుడు, హరిప్రసాద్ యాదవ్, వెంకటరామిరెడ్డి, రాజేంద్ర నాయుడు, ప్రసన్ననాయుడు, సాయిప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రసాద్, ఓబులేసు గౌడ్‌ను ఆదివారం స్థానిక మండిపల్లి భవన్‌లో టిడిపి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పూలదండలు శలవాలతో ఘనంగా సన్మానించి స్వీట్స్‌ను అందజేశారు. అనంతరం వారికి విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల తెలుసుకోవడం కోసం చేపట్టిన పాదయాత్రలో ఆయనకు అండగా నడిచిన వాలంటరీల పైన కేసులు పెట్టి ఎన్నో ఇబ్బందులు పెట్టిన వారు భయపడకుండా పాదయాత్రలో పాల్గొన్నారని కొనియాడారు. వారిలో రాయచోటి నియోజకవర్గం నుంచి అత్యధిక మంది వాలంటీర్లుగా ఉండడం సంతోషించదగిన విషయమనిన్నారు. రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వాలంటర్లీను అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి మదన్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సన్మానం పొందిన వాలంటీర్లతో రాంప్రసాద్‌రెడ్డి

చంద్ర దంపతులకు చెక్కును అందిస్తున్న సాయివికాస్‌రెడ్డి

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలంలో గాదెల పంచాయతి కొత్తపల్లి దళితవాడకు చెందిన పోలి చంద్ర, శోభరాణి కుమార్తె చంద్రకళ వివాహం కొరకు ముక్కా ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి కుమారుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి రూ.25 వేలు ఆర్థికసాయం చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండ లాల్లో నిరుపేద కుటుంబాల్లో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆపదలో ఉన్న వారికి నేనున్నాంటూ అభయం ఇస్తూ మానవత్వం చాటుకుంటున్నారని గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో జనార్ధన, చంద్ర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎండిపిడిఒ మల్లీశ్వరి, వైద్యాధికారి డాక్టర్ మనిషాలు పేర్కొన్నారు. మండలంలోని సోమవరం, వంగిమళ్ల గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన వికసిత్‌భారత్ సంకల్ప యాత్రతో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై డప్పుతో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అభయ కార్డులు పంపిణీ చేసిన ట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లీశ్వరి, డాక్టర్ మనీషా, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి, స్పెషల్ అధికారి జాకీర్ హుస్సేన్, సిహెచ్ఒ సుధాకర్, పిహెచ్ఎన్ గంగులమ్మ, సూపర్వైజర్ శివయ్య, ఎమ్మెల్యే హెచ్‌పిస్వాతి, శ్వేత, ఎఎన్ఎం రాజేశ్వరి, వెంకటలక్ష్మి, ప్రేమకుమారి, రాజు, నాగయ్య, మోహన్ పాల్గొన్నారు.

ముంపు గ్రామాలకు రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని వెలిగల్లు ముంపు గ్రామాలకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. వెలిగల్లు ప్రాజెక్టులో అధిక నీటిమట్టం ఉన్నప్పుడు పొలాల వద్దకు అష్టకష్టాలు పడి వెళ్లే వారమని, ట్యూబ్‌లు, బోట్‌లను ఆశ్రయించి భూముల వద్దకు చేరుకొని వ్యవసాయం చేసుకునే వారమని చెప్పారు. తాండ వాసులు ఎవరైన మృతి చెందితే భూస్థాపితం చేసేందుకు ట్రాక్టర్‌లలో తీసుకెళ్లే పరిస్థితి ఉండేదని అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లకు ప్రతి పాదనలు పంపారని తెలిపారు. ఎట్టకేలకు దిన్నె పాటి హరినాథ్‌రెడ్డి రోడ్డు నిర్మించేందుకు బాధ్యతగా తీసుకొని పనులు ప్రారంభించడం అభినందనీయ మన్నారు.

నిర్మాణంలో ఉన్న రోడ్డు

నేడు స్పందన రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

క్రిస్మస్ పండుగ సందర్భంగా జగనన్నకు చెబుదాం – స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు జిల్లా కలెక్టరేట్ కు రావద్దని సూచించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనిబి సెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన అథ్లెటిక్స్ పోటీలు విజయ వంతమయ్యాయి. జిల్లా నలుమూలల నుండి 14, 16 ఏళ్లలోపు బాల బాలికలు 300 మంది హాజరయ్యారు. 60 మీటర్లు, 600 మీటర్లు, హై జంప్, బ్రాడ్ జంప్, కిడ్స్ జావలి, షార్ట్‌పుట్ క్రీడాంశాలు నిర్వహించారు. కడప నుండి శ్రీలతరెడ్డి, సాయి అన్వేష్, శ్రీనివాస్, తేజేశ్వర్‌రెడ్డి, బి.సాయి.. ప్రొద్దుటూరు నుండి వీరభవ్యసాయిరెడ్డి, గురుదేవ.. తాళ్లమాపురం నుండి శశికళ.. బద్వేల్ నుండి కౌశిక గెలుపొందారు. వీరు కడప జిల్లా తరపున వచ్చే ఏడాది ఫిబ్రవరి 24న గుజరాత్‌లో జరగబోయే నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పో టీలలో పాల్గొనాల్సి ఉంటుందని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. శ్రీ సూర్య డాన్స్ అకాడమీ మదనపల్లె వారి చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, డ్యాన్స్ మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

6 నుంచి జిల్లా రైతు సంఘం మహాసభలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎర్రగుంట్ల మండల సమితి ఆధ్వర్యంలో జనవరి 6,7తేదీల్లో ఎర్రగుంట్లలో రైతు సంఘం జిల్లా 19వ మహాసభలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సాధనకు, రైతుల పొలాల్లో పంట కాలువలు నిర్మించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఇల్లూరు కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు సానబోయిన రమేష్, సిపిఐ మండల కార్యదర్శి జి భవానిశంకర్, సిపిఐ సీనియర్ నాయకులు టిసి ఓబుల్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సాకే రాధాకృష్ణ, పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలకు పథకాలు

ప్రజాశక్తి - చాపాడు

మహిళలు స్వయంగా ఆర్థిక ఎదుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అంది స్తున్నాయని ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి తెలిపారు. వీటిపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని చిన్నగురువలూరు, కుచ్చుపాప గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి డ్రోన్‌లు, గృహాలకు గ్యాస్ సబ్సిడీలు వంటి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

'సీమ'కు అన్యాయం చేయడం సిఎంకు భావ్యమా!

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ వాసిగా ఉంటూ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమకు అన్యాయం చేయడం భావ్యం కాదని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008–09లో రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం కడప–రాయచోటి–మదనపల్లె–బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మంజూరు చేసిందని చెప్పారు. దీని పొడవు 255.40 కిలో మీటర్ల దూరమన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,038 కోట్లు అన్నారు. నిధుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులు భరించేలా రైల్వేలైన్ మంజూరైనట్లు తెలిపారు. 2010 సెప్టెంబర్‌లో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప పనులకు శంకుస్థాపన చేశారన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలో మీటర్ల పని పూర్తయినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాల్సిన నిధులను విడుదల చేసి రైల్వే శాఖ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు

ఆధునిక సోక్రటీస్ 'తంధై పెరియార్'

ప్రజాశక్తి-మదనపల్లి

ఆధునిక సోక్రటీస్ తంధై పెరియార్ అని భారతీయ అంబేద్కర్ సేన, విసికె పార్టీ నాయకులు కొనియాడారు. పెరియార్ 50వ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు, విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ పెరియార్ నవయుగ ప్రవక్తగా, ఆసియా సోక్రటీస్‌గా, సామాజిక విప్లవ ఉద్యమ నిర్మాతగా, మూఢ మ్మకాలకు, అజ్ఞానానికి, దుర్మార్గపు ఆచారాలు, అనాగరిక వ్యవహారాలకు అగర్భ శత్రువులుగా నిలిచారని అన్నారు. పెరియార్‌ను పాశ్చాత్య దేశాలు ఆధునిక సొక్రటీస్‌గా గుర్తించారని అందుకే యునెస్కో ఆయనను దక్షిణాసియా సోక్రటీస్‌గా అభివర్ణించారని తెలిపారు. స్త్రీ స్వేచ్ఛగా బత కాలని స్త్రీలను వేశ్యలుగా మారుస్తున్న దేవదాసి వ్యవస్థపై రాజీలేని పోరాటం చేశాడని అన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టాన్ని అమలుకు కృషి చేశాడని, వితంతు పునర్వివాహాలను జరిపించి వారికి సమాజంలో విలువ తెచ్చారని పేర్కొన్నారు. తమిళనాడులోని మహిళలు ఆయనను తంధై(పెద్దాయన, గొప్పవాడు) అనే బిరుదుతో పిలుచుకునే వారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణప్ప, భారతీయ అంబేద్కర్ సేన అన్నమయ్య జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, రవిశంకర్, పీరు, శశి, రెడ్డి ప్రసాద్, భార్గవ్, రవి, లోకేష్, శ్రీకాంత్, హైదరవలి పాల్గొన్నారు.

పెరియార్ వర్ధంతి కార్యక్రమంలో బాస్, విసికె నాయకులు

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన 'బత్యాల'

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన మారమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న యువకుల్లో ప్రతిభ దాగి ఉంటుందని తెలిపారు. ఆ ప్రతిభను వెలికి తీయాలంటే ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచి చురుగ్గా చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. క్రికెట్ మాత్రమే కాకుండా సాయంత్రం సమయంలో కబడ్డీ, వాలీ బాల్, పరుగు పందెం లాంటి ఆటల పోటీల్లో పాల్గొనాలని కోరారు. క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 30 జట్లు పాల్గొంటున్నాయని, వీరందరూ కూడా శ్రద్ధతో టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షిం చారు. ప్రతి సంవత్సరం సంక్రాంతికి కొన్ని రోజుల ముందుగా ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ మందపల్లి గ్రామంలో నిర్వహించడం సంతోషకరమ న్నారు. అనంతరం సరదాగా కాసేపు యువతతో కలిసి బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులుగా శరత్‌కుమార్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైజాగ్ ఆంధ్రయూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన 32వ వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కొండూరు శరత్ కుమార్ రాజును ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనను ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. వాకర్స్ తరఫున ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్ మాధవనాయుడు, సుధాకర్ రెడ్డి, ఆర్‌సి .ప్రతాప్, వాకర్ సభ్యులు చేజర్ల సుబ్రమణ్యంరాజు, కోనేటి రవిరాజు, అమ్మినేని వెంకటయ్య నాయుడు, విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ పెంచలయ్య, నలిగి రెడ్డయ్య, సుబ్బరాజు, దగ్గుబాటి రవిశంకర్ పాల్గొన్నారు.

శరత్‌కుమార్‌రాజును సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

రాజంపేట ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా ఆనంద్‌యాదవ్

వెంకటరమణరాజును అభినందిస్తున్న ఆనంద్‌యాదవ్

ప్రజాశక్తి-మదనపల్లె

రాజంపేట ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రముఖ న్యాయ వాది తుర్లు ఆనంద్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తున్నట్లు ప్రక టించారు. పథకాల హామీల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. యాదవ కుటుంబానికి చెందిన తాను సుమారు 20 ఏళ్లుగా న్యాయవాది వృత్తిలో రాణిస్తూ మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల ప్రజలతో సత్సంబంధాలు ఏర్పర చుకున్నట్లు చెప్పారు. ప్రజల కోరిక మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తనను ఆద రించి గెలిపిస్తే ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాజ కీయ పార్టీలు అవకాశం కల్పించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తన సత్తా ఏంటో నిరూ పిస్తానని చెప్పారు. అనంతరం మాజీ టిడిపి నాయకులు వెంకటరమణరాజు మర్యాద పూర్వ కంగా కలిసారన్నారు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు మజ్జిగ గోపాల్ యాదవ్, రెడ్డిభాస్కర్, ధన, మహేష్, క్రాంతికుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధార్థ పాల్గొన్నారు.

సమస్యల వలయంలో ప్రయివేట్ పాఠశాలలు

- జెఎసి చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఎపి ప్రయివేట్ పాఠశాలల జెఎసి చైర్మన్ లెక్కల జోగిరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌వి శుభం ఫంక్షన్ హాల్‌లో ఎపి ప్రయివేట్ స్కూల్స్ జెఎసి ఆధ్వర్యంలో హైకోర్టు సీనియర్ ఎడ్యుకేట్, ఎపి ప్రయివేట్ విద్యాసంస్థల అడ్వైజర్ మతుకుమిల్లి విజయ, కృష్ణాజిల్లా ప్రయివేట్ పాఠశాలల అధ్యక్షులు గొల్లపూడి మోహన్‌రావు, రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన పాఠశాల అధిపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జోగిరామిరెడ్డి మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలో అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్యలన్నీ ప్రభుత్వం నెరవేర్చకపోవడం వలన కోర్టు నుంచి సమస్యలను పరిష్కరించుకునే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. రెన్యువల్ గతంలో పది సంవత్సరాలు ఇస్తూ ఉంటే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాలపరిమితిని మూడు సంవత్సరాల కుదించారని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో 8 సంవత్సరాలకు పెంచాల్సిన తెలిపారు. ఈ విధంగా ప్రయివేట్ పాఠశాలలకు అనేక రకాల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. సమస్యను పరిష్క రించుకోవడానికి రాష్ట్రస్థాయిలో ఒక బలమైన అసోసియేషన్ అవసరముందని చెప్పారు. ప్రయివేట్ పాఠశాలల లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని రకాల విద్యాసంస్థలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గొల్లపూడి మోహన్‌రావు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలు పరిరక్షించుకోవాలంటే రాష్ట్రస్థాయిలో బలమైన అసోసియేషన్ ఉంటే తప్ప సమస్యలకు పరిష్కారం లభించదని చెప్పారు. ఈ సందర్భంగా కొత్త రాష్ట్ర అసోసియేషన్ పేరు అప్స డెమొక్రటిక్ అని ప్రకటిం చారు. విధి విధానాలు సభ్యులకి వివరించారు. సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 400 మంది కరస్పాండెంట్లు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న లెక్కల జోగిరామిరెడ్డి

'పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం'

సేవలు అందించిన విద్యార్థులకు మెమొంటోలను అందజేసిన చక్రపాణిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుపేద ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీచైతన్య పాఠశాల ఆవరణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మోహన్ డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుమేహం వ్యాధి పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలతోపాటు ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైనప్పటి నుండి ఎంతో మంది నిరాశ్రయులు, అభాగ్యులు, వృద్ధులకు సేవలు అందించినట్లు చెప్పారు. డాక్టర్ మోహన్ డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన మధుమేహం వ్యాధికి వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో చాలామంది రోగులు శిబిరానికి తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యశిబిరంలో సేవలు అందించిన విద్యార్థులకు మెమొంటోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ మేనేజర్ సుధీర్, వైద్య సిబ్బంది కార్తీక్, శివ, రమేష్, బలరాం, శాంతి, ప్రియాంక, రిజ్వాన్, మానవత సేవా సంస్థ డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, డాక్టర్ అరుణ్‌రాజు, గోపి, ధనుంజయరెడ్డి, షర్మిల, రమాదేవి, పద్మావతి, ప్రియ, నాగసుబ్బారెడ్డి, పిఇటి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిగారూ.. కడప ఉక్కుపై స్పందించండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా మూడు రోజుల పర్యటనలో కడప ఉక్కుపై స్పందించాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్ యాదవ్ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కడప ఉక్కుకు రెండు సార్లు పునాదులు వేశారని, పనులు ఏమాత్రం ముందుకు సాగలే దన్నారు. కనీసం కేంద్రాన్ని కూడా మన హక్కు అయిన కడప ఉక్కుపై పార్లమెంటులో నిలదీయకపోవడం దారుణ మన్నారు. ఇక్కడి యువత ఉద్యోగాల కోసం వలసలు పోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించదు.. ప్రజాఉద్యమ నాయకులను అడగనీయకుండా ముందస్తు నోటీసులు, అరెస్టులతో నిర్బం దిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్య మంత్రి కడప ఉక్కు నిర్మాణ పనులు చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలని కోరుతు న్నామన్నారు. సమావేశంలో నాయకులు మహేష్ పాల్గొన్నారు.

ఒకే వేదికపై టిఎన్ కుటుంబ సభ్యులు

టిఎన్ కుటుంబీకుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మాజీ ఎమ్మెల్యే టిఎన్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపిపి సతీమణి ప్రమీలమ్మ ఆధ్వర్యంలో టిఎన్ కుటుంబీకులు ఆదివారం తంబళ్లపల్లె టిఎన్ బంగ్లాలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ మల్లయ్య కొండకు వెళ్లి శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషే కాలు నిర్వహించారు. మల్లయ్యకొండ ప్రకృతి సౌందర్యాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. టిఎన్ బంగ్లాలో విందు భోజనాలు చేసి నాటి తాతల కాలం నాటి భవంతిని పరిశీలించి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. కార్యక్ర మంలో ప్రముఖులు టిఎన్ విజయనారాయణరెడ్డి, దినకర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్న దేవిరెడ్డి ఆదిత్య

కడప నగరంలో మారథాన్ రన్

ప్రజాశక్తి - కడప : కడప నగరంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం భాగంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మారథాన్ రన్ నిర్వహించారు. దేవి రెడ్డి ఆదిత్యతోపాటు వైసిపి యువజన విభాగం నాయకులు షఫీ, శ్రీకాంత్ రెడ్డి, అక్షయ రెడ్డి, సబర్నాథ్ రెడ్డి, యాసిన్ భాష, గౌస్‌బాష, యువజన విభాగం నాయకులు, క్రీడాకారులు మారథాన్ రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మారథాన్ రన్ ను కార్పొరేటర్ సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవి రెడ్డి ఆదిత్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆడుదాం ఆంధ్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలైన వారికి నగదు బహుమతులు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం నాయకులు, యువత, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విమర్శిస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - కడప : కుల సంఘం ముసుగులో వైసిపి ప్రజా ప్రతినిధులను విమర్శిస్తే చూస్తూ సహించేది లేదని వైసిపి సీనియర్ నాయకులు వై. సుదర్శన్ రాయల్ ఘాటుగా హెచ్చరించారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరులేని, గుర్తింపులేని బలిజ సంఘం పేరుతో కడప ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి బలిజలు ఓట్లు వేయకూడదనే అనే వార్తకు కడప నగర బలిజలకు ఎలాంటి సంబంధం లేదన్నారు.ఇది ముమ్మాటికి బలిజ కులస్థులను వైసిపికి, నాయ కులకు దూరం చేయాలనే కొంత మంది పన్నిన పన్నాగం అన్నారు. కుల సంఘాల పేరుతో వ్యక్తిగత అవసరాల కోసం కొన్ని పార్టీలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న వారికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న వికాస్ హరి, విద్యార్థులు

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కడప

నగరం ఐటిఐ సర్కిల్ వద్దనున్న వికాస్ హైస్కూల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడు కలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరెస్పాండెంట్ వికాస్ హరికృష్ణ హెడ్మా స్టర్ హమీద్ , ఉపాధ్యాయులు మరియు శాంటా ప్లాజాతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండ్‌మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన బోధనలో మానవాళికి ప్రేమను పంచడం నేర్పించాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. శాంటా క్లాస్ వేషధారణలో విద్యార్థులు పిల్లలందరికీ కూడా స్వీట్లు పెట్టార కార్యక్రమంలో ప్రిన్సిపల్ పర్వీన్, ఏవో స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

వేంపల్లె ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే జిల్లా మహా సభలను భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని వేంపల్లె మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బి.రామంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ కోరారు. ఆదివారం వేంపల్లెలో బాలుర పాఠశాల ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహసభల కరపత్రాలను కార్మికులతో కలిసి రామాంజనేయులు ఆవిష్క రించారు. కార్యక్రమంలో చిన్నోడు, అంజీ, రమణ, బాబు, వల్లి, బాలగంగులు పాల్గొన్నారు.

అక్రమ క్లస్టర్ విధానాన్ని ఆపేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్ధక శాఖలో తీసుకొచ్చిన అక్రమ క్లస్టర్ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని, నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియర్స్ డిమాండ్ చేశారు. అదివారం పశువైద్యశాలలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియర్స్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి సంవత్సరమూ ఆన్‌లైన్ ప్రగతి నివేదికలు, గ్రామీణ రైతాంగానికి మెరుగైన పశువైద్యం అని చెబుతూ దాదాపు 3500 మంది నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ పోస్టులను తగ్గించడం ఒక అలవాటుగా మారిపోయిందన్నారు. క్లస్టర్ విధానం పేరుతో తమ క్యాడర్లను నాశనం చేయాలనే ఆలోచనను అధికారులు విరమించు కోకపోతే రాష్ట్ర ఎపి ఎన్‌జిఒ నాయకత్వం సహకారంతో ఎటువంటి ఉద్యమానికైన సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో అన్నమయ్య జిల్లా చైర్మన్ జయప్రకాష్, కార్యదర్శి సదాశి వయ్య, రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా, సహ అధ్యక్షుడు ఎం విద్యాసాగర్ ట్రెజరర్ బాబు నాయక్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి వెంకటసుబ్బయ్య ,కార్యదర్శి సాల్మన్ రాజు, ట్రెజరర్ మోహన్ సాయి, సహ అధ్యక్షులు ఖాదర్ బాబు, వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జైపాల్, ఉపాధ్యక్షులు హిమబిందు, సురేష్ కుమార్ ,లక్ష్మీదేవి, షాహిదా బేగం, వెంకటసుబ్బయ్య ,పెంచలరాజు ,శివలక్ష్మి ,బ్రహ్మయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, మహదేవ, సురేష్ కుమార్, ఇమ్రాన్ భాష, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల రాజశేఖర్